క్లుప్తంగా

విరబూసిన మే పుష్పాలు


కొత్తపల్లిలో విరబూసిన మే పుష్పాలు

కొత్తపల్లి: స్థానిక కాకరపల్లి గంగాధర్‌రావు స్వగృహం వద్ద ఆదివారం మే పుష్పాలు విరబూశాయి. ఎంతో అపురూపంగా పెంచుకుంటున్న మొక్కలు ఒకేసారి 13 పుష్పాలను పూసి చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీటిని చూసేందుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. వీటిని పలువురు తమ సెల్‌ఫోన్‌లో బంధించారు.

పంచారామ క్షేత్రంలో ఏకాదశి పూజలు


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని ఉత్సవమూర్తులు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి శివలింగం జీర్ణోద్ధరణ పనులు జరగడంతో నంది మండపంపై ఏర్పాటు చేసిన ఉత్సవ మూర్తులకు ఆలయ పండితులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం సమీపంలో ఉన్న శివలింగానికి పాలతో, ఆలయ పుష్కరణిలోని నీటితో అభిషేకాలు చేసి, ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఆలయ పండితులు అల్లకి రాజ్‌గోపాల్ శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్నలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కాలువలో పూడికతీత పనులు


హుస్సేన్‌పురం వద్ద గోదావరి కాలువలో చేపట్టిన పూడికతీత పనులు

సామర్లకోట: లాకుల నుంచి హుస్సేన్‌పురం వరకు 1.8 కి.మీ.పొడవున గోదావరి కాలువలో పూడికతీత పనులు జరుగుతున్నట్టు ఇరిగేషన్ శాఖ సామర్లకోట జేఈ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గోదావరి కాలువ నుంచి పంట కాలువలకు నీటి ప్రవాహంలో ఇబ్బందులు లేకుండా చేయడానికి పూడికతీత పనులు జరుగుతున్నాయని చెప్పారు. సామర్లకోట లాకుల నుంచి హుస్సేన్‌పురం వరకూ మూడున్నర కి.మీ. ఉండగా, కేవలం 1.8 కి.మీ. మాత్రమే పూడికతీతకు అనుమతి లభించిందన్నారు. దాంతో గోదావరి కాలువలో మేట వేసిన ప్రదేశాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. ఈ నెల తొలి వారంలో గోదావరి కాలువకు నీరు వచ్చే అవకాశం ఉన్న కారణంగా ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఈ నెల 8వ తేదీ వరకు పనులు జరుగుతాయని వివరించారు. దాంతో ఈ నెల 8 తర్వాతే గోదావరి కాలువకు నీరు వస్తుందని నాగేశ్వరరావు తెలిపారు.

ముంచెత్తిన వాన


కరప ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

కరప: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ముంచెత్తడంతో జనజీవనం స్తంభించింది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రోహిణీ కార్తె ప్రారంభంలో వడగాడ్పులు, ఎండ వేడిమికి ప్రజలు విలవిల్లాడారు. శని, ఆదివారాల్లో వర్షం పడటంతో రోహిణీకార్తె కూల్కూల్‌గా మారడంతో ప్రజలు ఉపశమనం పొందారు. హమ్మయ్య ఎండల నుంచి వరుణుడు కరుణించాడంటూ సంతోషించారు. ఉదయం నుంచీ ఆకాశంలో దట్టమైన మబ్బులు కమ్మి పగలే చీకటిమయమైంది. చల్లటి గాలులు వీయడంతో ప్రజలు వేసవి తీవ్రత నుంచి ఉపశమనం పొందారు.

భౌతిక్క దాడులు

- పట్టణ, మండల పరిధిలో ఎటు చూసినా వీధి కుక్కలే..
- జనాలపై పెరుగుతున్న కుక్కల దాడులు
- నియంత్రణకు కానరాని చర్యలు


సామర్లకోట పట్టణంలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

సామర్లకోట: పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు రోడ్లపై తిరగడానికి భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కుక్కల నుంచి తమకు రక్షణ కల్పించాలంటూ వారు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కుక్కలను సంహరించడానికి వీల్లేదని, వాటి రక్షణ కోసం జంతు జీవ రక్షణ సమితి పోరాడుతోంది. దాంతో కుక్కలను నియంత్రించ లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వీధి కుక్కలు సాధారణంగా కాటు వేయవని, వాటిని హింసించడం ద్వారా కొంత మేరకు తిరుగుబాటు చేస్తాయనే వాదనలున్నాయి. ప్రస్తుత వేసవిలో గతంలో ఎన్నడూ లేనంతగా ఎండలు ఉండడంతో కుక్కలు వెర్రెక్కి, పాదచారులపై దాడులు చేస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఓ ప్రాంతంలో కుక్కల జంట ఉంటే, ఆరు నెలల్లో వాటి సంఖ్య సుమారు 20కు చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పట్టణంలోని స్టేషన్ సెంటర్, సత్యనారాయణపురం, బలుసుల పేట, బ్రౌన్‌పేట, పెన్షన్‌లైన్లలో కుక్కలు ఎక్కువగా గుంపులుగా తిరుగుతున్నాయి. కుక్కలను నియంత్రించకపోతే కుక్క కాట్లతో ప్రజలకు ప్రాణాంతక పరిస్థితులు ఎదురవ్వవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్క కాటుకు గురైన వెంటనే చికిత్స అందకపోతే, మృత్యువును కోరి తెచ్చుకున్నట్టే అవుతుందంటున్నారు.

చికిత్సే కీలకం

కుక్క కాటు వల్ల వచ్చే రాబిస్ వ్యాధిని నివారించడానికి యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయించాలి. ఈ వ్యాక్సిన్ ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా వేస్తారు. బయట ఒక డోసు రూ.300 నుంచి రూ.500 వరకు ఉంటుంది. కుక్కకాటుకు గురైన వ్యక్తి తప్పనిసరిగా కోర్సు ప్రకారం ఐదు డోసుల్లో వ్యాక్సిన్ వేయించుకోవాలి. దానికి తోడు కొన్ని జాగ్రత్తలు కూడా తీసుకోవలసి ఉంటుంది. రకరకాల కుక్కలు గుంపులుగా తిరగడంతో వాటి కాటుకు గురైన వ్యక్తి వెంటనే యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయించుకోవలసి ఉంది.

ప్రతి వారం కుక్కకాటు కేసులు

ఇటీవల కాలంలో కుక్కకాటు రోగులు ఎక్కువగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి రావడంతో, వైద్యాధికారులు కుక్క కాటు వ్యాక్సిన్‌కు కొరత లేకుండా జాగ్రత్తలు పడుతున్నారు. సామర్లకోట ఆరోగ్య కేంద్రంలో వారానికి ఐదు, వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారానికి మూడు కుక్కకాటు కేసులు వస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. అనేక మంది ఇళ్లలో కుక్కలను పెంచుకుంటూ, వాటిని కూడా రోడ్ల మీదకు విడిచి పెడుతున్నారనే విమర్శలున్నాయి. గతంలో లాగే పెంపుడు కుక్కలకు లైసెన్సు బిళ్లలు ఇచ్చి, మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే విధంగా చూడవలసి ఉంది.

ప్రతి వార్డులోనూ కుక్కల బెడద



ప్రతి వార్డులోను కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. వేసవి కాలం, ఎండలు ఎక్కువగా ఉండటంతో వెర్రెక్కి పోయి రోడ్డుపై నడిచి వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో ఏ సమయంలో వచ్చినా కుక్కకాటు ఇంజెక్షన్ ఇచ్చే విధంగా చూడాలి. పట్టణ పరిధిలో రోడ్లపై తిరుగుతున్న కుక్కలను మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుని, వాటి నిర్దిష్ట ప్రదేశంలో ఉంచి సంరక్షణ చేయాలి.

– కొల్లి లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్, సామర్లకోట

ఆపరేషన్లు ఒక్కటే మార్గం



పట్టణ పరిధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్న మాట వాస్తవమే. నిబంధనల మేరకు కుక్కలను చంపడానికి వీలులేదు. అవి దాడులు చేస్తున్నాయనే ప్రజల నుండి ఫిర్యాదుల మేరకు, కౌన్సిల్ సమావేశంలో తీసుకునే నిర్ణయం మేరకు చర్యలు చేపడతాం. పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో కుక్కల సంతతి పెరగకుండా ఆపరేషన్లు చేయించడం ఒక్కటే మార్గం.

– జాస్తి రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

అందరిపై ప్రసన్నాంజనేయుడి కటాక్షం ఉండాలి

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు


పులిమేరు ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దొరబాబు

పెద్దాపురం: ధైర్యశాలి ప్రసన్నాంజనేయుడు కటాక్షం ప్రతి ఒక్కరిపై ఉండాలని, వారిలో ఆధ్యాత్మికతత్వం పెంపొందించుకోవాలని వైఎస్సార్ సీపీ పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని పులిమేరు (చదలాడ జంక్షన్) అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్న సమారాధనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు తుమ్మల అచ్యుతరామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు గోపు మురళి, సుందరరెడ్డి రాజు, సింగన చంటియ్య, మసిముక్కల రామకృష్ణ, తోట శేషారావు, ముమ్మిడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పప్పెట్రీ షో


పీసీసీ క్యాంప్‌లో ప్రదర్శిస్తున్న పప్పెట్రీ షో

పెద్దాపురం: పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం నిర్వహించిన పప్పెట్రీ షో (బొమ్మల తయారీ, ప్రదర్శన) పలువురిని ఆకట్టుకుంది. క్యాంప్ కన్వీనర్ కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన ఈ ప్రదర్శనలో బొమ్మలతో నాట్యం, బొమ్మలను తయారు చేయడం వంటి ప్రదర్శనలతో పాటు, బుద్దా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్, కరాటే టీచర్ దుంగల పూజిత, సూర్యశ్రీ, రవికుమార్, అమృత, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..

విద్యార్థులు చిన్న వయసు నుంచే నీతి కథలపై మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలని శాఖా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం తెలుగు పద్యాలు, నీతి కథలు, పుస్తక సమీక్ష వంటి అంశాలపై వాట్సాప్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో అందిస్తున్న పుస్తకాలను విద్యార్థులు చదవాలని, గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

లేచింది మహిళా లోకం...!

- పిఠాపురంలో మహిళా సాధిక సమాఖ్య ఏర్పాటు
- ఒక చోట కలిసిన అన్ని రంగాల మహిళలు


జ్యోతి వెలిగించి మహిళా సాధిక సమాఖ్యను ప్రారంభిస్తున్న వనం సత్యప్రియ


సమావేశానికి హాజరైన మహిళలు

పిఠాపురం: అన్ని రంగాల్లోని మహిళలు ఐక్యతతో ఉండి వారి సమస్యలను వారే పరిష్కరించుకోవాలని పలువురు మహిళా నాయకులు పిలుపునిచ్చారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఆదివారం అక్కచెల్లెమ్మలు మహిళా సాధిక సమాఖ్య ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. అన్ని రంగాల్లో ఉన్న మహిళలు ఒకే చోట కలిసి చర్చించుకుని ఎవరికి ఏ అవసరం వచ్చినా, ఏ సమస్య వచ్చినా పరస్పరం సహాయ సహకారాలు అందించుకునే విధంగా అందరూ కృషి చేయాలని మహిళా ప్రతినిధులు నిర్ణయించారు. న్యాయవాది, పోలీసు, టైలర్, టీచర్, బ్యూటీషియన్, రాజకీయ నేత, డాక్టర్, యోగా శిక్షకులు, గృహిణి, సంగీతం, సాహిత్యం తదితర రంగాలకు చెందిన మహిళలు హాజరై అందరు కలిసి కట్టుగా ఉండి ఒకరికి ఒకరు సహకారంగా ఉండాలన్నారు. మహిళలకు సమస్యలు వచ్చినప్పుడు ఇతరులను ఆశ్రయించకుండా మహిళలే ముందుండి ఆ సమస్యను పరిష్కరించేలా అందరూ కృషి చేయాలని మహిళా సాధిక సమాఖ్య అధ్యక్షురాలుగా వనం సత్యప్రియ, సెక్రటరీగా కొత్త ప్రవీణ, ట్రెజరర్‌గా విజమూరి గాయత్రి కోరారు. మహిళలకు అండగా నిలవాలన్న సదుద్దేశంతో ఈ సమాఖ్య ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మహిళా డాక్టర్ వరలక్ష్మి, న్యాయవాది సత్య, మహిళా పోలీసు తులసి, మహిళా రాజకీయ వేత్త తోలేటి శిరీష, లెక్చరర్ కొత్త శ్యామల, టీచర్ సీత, గృహిణి మాగాపు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ఎన్నికల పరిశీలకుడు గణేష్

కాకినాడ: జూన్ నాలుగో తేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కాకినాడ సిటీ నియోజకవర్గ పరిశీలకులు ఎస్.గణేష్ తెలిపారు. స్థానిక జేఎన్‌టీయూకే ఆవరణలోని ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన ఆర్వో వెంకటరావుతో కలిసి ఆదివారం సందర్శించారు. అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. కాకినాడ సిటీ నియోజకవర్గ కౌంటింగ్ కోసం 14 టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ సర్వీస్ ఓట్ల కౌంటింగ్ కోసం మరో ఐదు టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. 17 రౌండ్లలో కౌంటింగ్ జరుగుతుందని ఆర్వో వెంకటరావు తెలిపారు. అలాగే సర్వీస్ ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ కోసం ఐదు టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. వీరి వెంట పలువురు ఎన్నికల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు పాటించాలి: ఆర్ఓ

కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే అభ్యర్థుల తరపు ఏజెంట్లు విధిగా నిబంధనలు పాటించాలని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు స్పష్టం చేశారు. స్థానిక కార్పొరేషన్ కార్యాయంలో ఆదివారం ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల తరపు ప్రతినిధులతో సమావేశమయ్యారు. కౌంటింగ్‌లో ఏజెంట్ల పాత్ర, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఉదయం ఆరు గంటలకల్లా కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్‌కు చేరుకోవాలని సూచించారు. కౌంటింగ్ హాలు లోపలకు మొబైల్, పుస్తకం, పెన్నుతో సహా వేటినీ అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ విధానాన్ని వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఇతర అధికారులున్నారు.


స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్


ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: కాకినాడ జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, నిఘా వ్యవస్థ, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె నివాస్ ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల బయట భోజన వసతి, మొబైల్ ఫోన్ల కౌంటర్ల ఏర్పాటుపై ఆయన సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేపట్టామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు పడకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నివాస్ ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ నివాస్ వెంట జగ్గంపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం శ్రీనివాసరావు, ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ శ్రీనివాసరావు, ఇతర ఎన్నికల అధికారులు ఉన్నారు.

టెన్షన్.. టెన్షన్..

- సార్వత్రిక ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- అభ్యర్థుల భవితవ్యం తేలేది రేపే..



కరప: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుండడంతో అటు అభ్యర్థుల్లో, ఇటు వివిధ పార్టీల క్యాడర్‌లోనూ ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ రోజుకు, కౌంటింగ్ రోజుకు మధ్య 21 రోజుల పాటు సాగిన కాకిలెక్కలకు తెరపడనుంది. వివిధ వర్గాల వారు ఆసక్తిగా ఎదురుచూసిన క్షణానికి కొన్ని గంటలే మిగిలి ఉంది. ఫలితం ఎలా ఉంటుందోనని గ్రామాల్లో చర్చలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఇనాళ్లు సాగిన విశ్లేషణలకు, ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలకు లెక్కలు తేలనున్నాయి.

సంక్షేమం, అభివృద్ధే గెలుపు మంత్రాలు

ఇలాఉండగా 2019లో తిరుగులేని విజయం సాధించి, చరిత్ర సృష్టించినట్టే రెండోసారి కూడా రికార్డు స్థాయిలో గెలుపొంది, అధికారం నిలబెట్టుకుంటామని వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తుండగా, 2014 నాటి ఎన్నికల ఫలితాలు పునరావృతం అవుతాయంటూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని, చేసిన మేలును మర్చిపోకుండా మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారు మరోసారి గెలిపించాలన్న కృతనిశ్చయంతో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారంటూ విశ్లేషిస్తున్నారు. **మీకు మేలు జరిగితేనే ఓటు వేయండని అడిగిన దమ్మున్న నాయకుడు సీఎం జగన్ అని, అందుకే ఓటర్లు ఇచ్చే తీర్పు తమ పార్టీకే అనుకూలంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ నేతలు అంటున్నారు. అధికార పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ఉం**దంటూ.. ఎన్నికల నేపథ్యంలో అనైతిక పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు దుష్ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రస్తావించకుండా, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేని ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తప్పుడు ప్రచారం చేయడం, పవన్ కల్యాణ్ తమవెంట ఉండటంతో గెలుస్తామంటూ కూటమి నేతలు ఊహాలోకంలో విహరిస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబును నమ్మే స్థితిలో ఎవరూ లేరని, అధికారం కోసం ఎంతకైనా తెగిస్తాడనే అభిప్రాయం ప్రజల్లో నెలకొని ఉంది. తొలిసారి కురసాల కన్నబాబు 2009లో ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, 2019లో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యేగా రెండోసారి గెలుపొంది, మంత్రిగా, ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అభివృద్ధిపరంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంతో పాటు, రాజకీయాలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించారని ఆయన అనుయాయులు చెబుతున్నారు. అదే తమ పార్టీని, నేతను గెలిపిస్తుందని కన్నబాబు వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని జనసేన అభ్యర్థి పంతం నానాజీ వర్గీయులు ఆశాభావంతో ఉన్నారు.

ఇక్కడ గెలుపెవరిదో?

జిల్లాలో 2009లో నియోజకవర్గాల విభజనతో కాకినాడ రూరల్ నియోజకవర్గం ఏర్పడింది. అంతవరకు తాళ్లరేవు నియోజకవర్గంలో ఉన్న కరప మండలాన్ని, సంపర నియోజకవర్గంలో ఉన్న కాకినాడ రూరల్ మండలాన్ని, కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఉన్న ఆరు డివిజన్లను కలిపి కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. 2009లో కాంగ్రెస్, టీడీపీలను కాదని ప్రజారాజ్యం పార్టీ తరఫున పోటీ చేసిన కురసాల కన్నబాబు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా పిల్లి అనంతలక్ష్మి నెగ్గారు. 2019లో టీడీపీ తరఫున అనంతలక్ష్మి, వైఎస్సార్ సీపీ తరఫున కురసా కన్నబాబు, జనసేన తరఫున పంతం నానాజీ మధ్య త్రిముఖ పోరు సాగింది. అప్పుడు రెండోసారి కన్నబాబు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2024లో వైఎస్సార్ సీపీ తరఫున కన్నబాబు పోటీలో ఉండగా, జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిగా ఏర్పడటంతో.. జనసేన తరఫున పంతం నానాజీ, మరో 13 మంది స్వతంత్రులు బరిలో నిలిచారు. ఇక్కడ వైఎస్సార్ సీపీ, జనసేన మధ్య ద్విముఖ పోటీ నెలకొంది. నియోజక వర్గాన్ని రూ.750 కోట్లతో అభివృద్ధి చేయడమే కాకుండా, 32 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలిచ్చామని, అన్ని వర్గాల ప్రజల మద్దతు తమ పార్టీకే ఉందని వైఎస్సార్ సీపీ శ్రేణులు చెబుతున్నారు. ప్రధానంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు, మహిళా ఓటర్ల మద్దతు తమ పార్టీకే ఉందని, 8 వేల మెజార్టీకి తగ్గకుండా గెలుపొందడం ఖాయమని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా చర్చలు

ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీ విజయం సాధిస్తుందోనన్నది గ్రామాల్లో చర్చనీయాంశమైంది. ఏ ఇద్దరు కలుసుకున్నా ఎన్నికల ఫలితాలు, ఎగ్జిట్ పోల్స్ పైనే రసవత్తరంగా చర్చించుకుంటున్నారు. ఫలితాలు ఎలా ఉంటాయోననే దానిపై గ్రామాల్లో సుదీర్ఘ చర్చలు, బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. ఫలితాలు వచ్చే వరకూ అటు అభ్యర్థుల్లోను, ఇటు ప్రజల్లోను టెన్షన్ తప్పేట్టు లేదు.

సాహిత్య పరిచయ సభ

బోట్‌క్లబ్: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో స్థానిక గాంధీభవన్‌లో ఆదివారం ప్రముఖ రాయలసీమ కవి, కథకులు జి.వెంకటకృష్ణ సాహిత్య పరిచయ సభ నిర్వహించారు. సంస్థ నగర అధ్యక్షుడు మార్ని జానకిరామ చౌదరి వక్తలను ఆహ్వానించారు. వెంకటకృష్ణ సాహిత్య నేపథ్యాన్ని అద్దేపల్లి ప్రభు పరిచయం చేశారు. ఆయన రాసిన గరుడస్తంభం, చిలుకలు వాలిన చెట్టు, దేవరగట్టు వంటి కథా సంపుటుల్ని, కవిత్వ సంపుటుల్ని క్లుప్తంగా పరిచయం చేశారు. కవి, కథకులు వెంకటకృష్ణ సహకార శాఖ జిల్లా అధికారిగా కాకినాడకు రావటం సాహితీ ప్రియులకు సంతోషదాయకమని జ్యోష్యుల కృష్ణబాబు అన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో గరికపాటి మాస్టారు, బొల్లోజు బాబా, గౌరీనాయుడు, మణిబాబు, శైలజ, సత్య, సావిత్రీ ప్రసాద్, కాకరపర్తి దుర్గాప్రసాద్, చలపతి, సాయిసత్యనారాయణ, శివ, శిరీష, పోచినపెద్ది, సీతారామరాజు, సాలార్, ఇబ్రహీం, కామేశ్వరరావు తదితర కవులు తమ కవితల్ని వినిపించారు.